క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ ట్రైనింగ్ క్యాలెండర్ ఆవిష్కరణ



ట్రైనింగ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎండీ అతుల్‌భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ 2023–24 ట్రైనింగ్ క్యాలెండర్‌ను శనివారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో సీఎండీ అతుల్‌భట్ ఆవిష్కరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ, కంప్యూటర్, భద్రత, ఆరోగ్యం తదితర అంశాలపై ఉద్యోగులకు ఇవ్వనున్న కార్యక్రమాలతో కూడిన వివరాలతో క్యాలెండర్‌ను రూపొందించారు. క్యాలెండర్‌ను రూపొందించిన ట్రైనింగ్ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో సీజీఎం జి. గాంధీ, ట్రైనింగ్ విభాగాధిపతి ఎస్. భాను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నీటి దినోత్సవ వేడుకలు



నీటి పొదుపు పాటించిన విభాగం అధికారులకు షీల్డులందజేస్తున్న సీజీఎం మహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు శనివారంతో ముగిసాయి. 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన వేడుకల్లో వివిధ పోటీలు నిర్వహించారు. శనివారం ఈడీ (వర్క్స్) కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ముగింపు వేడుకల్లో సీజీఎం (వర్క్స్) బి.కె. మహంతి ముఖ్య అతిథిగా హాజరై నీటి పొదుపు పాటించిన విభాగాలకు షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ వి. శ్రీదేవి, కెమ్ బాండ్ ప్రతినిధి అనూప్ రంజన్ నీటి నిర్వహణ విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ : జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబేకాలనీలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వారి ఆలయ సన్నిధిలో శనివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పైల శ్రీనివాసరావు, దమయంతి దంపతుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీ నృసింహస్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ దొడ్డి రమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంజుల, పెంటకోట పైడిరాజు, రామారావు, నరసింగరావు, సత్యవతి, సావిత్రి, లక్ష్మి, నాగమణి, పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రోజులోనే రూ.కోటిన్నరకు పైగా ఆస్తి పన్ను వసూలు



జెడ్సీ సింహాచలానికి ఆస్తిపన్ను చెక్కులు అందజేస్తున్న ఆర్వో శ్రీకాంత్ తదితరులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లో ఆస్తి పన్ను ఒక్క రోజులోనే రూ.1.56 కోట్లు వసూలైంది. వడ్డీ మినహాయింపును అమలు చేస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ అధికారి శ్రీకాంత్ సారథ్యంలో ఆర్‌ఐలు శివ, మోహన్ పలువురు భవన యజమానులను స్వయంగా కలిసి ఈ మొత్తాన్ని వసూలు చేశారు. విశాఖ డెయిరీ ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి రూ.89.78 లక్షలు వసూలు చేయగా, జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కౌంటర్ ద్వారా రూ.66 లక్షలు వసూలైనట్టు జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులను అభినందించారు. వడ్డీ మినహాయింపు అవకాశాన్ని ఆస్తిపన్ను చెల్లింపుదారులందరూ వినియోగించుకోవాలని కోరారు.

రాగి జావలో సంపూర్ణ పోషకాలు



విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ : రాగిజావలో సంపూర్ణ పోషకాలు ఉంటాయని, విద్యార్థులు దీనిని తాగడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ఆయన రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి ఆరోగ్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాగి జావ అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, మార్టుపూడి పరదేశి, వైఎస్సార్‌సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, గంట్యాడ గురుమూర్తి, వెంకటేష్, పిట్టా రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : శ్రామికుల కష్టాలను పట్టించుకోకుండా సొంత లాభం కోసం కేంద్ర ప్రభుత్వం వారిని విస్మరిస్తుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు 772వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన ఎస్.ఎం.ఎస్–2 విభాగం కార్మికులు కూర్చున్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు తోడ్పడకుండా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలన్నారు. రానున్న కాలంలో లక్షలాది మంది కార్మికులు, కర్షకులు, ప్రజలతో మమేకమై విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలకు డిమాండ్

అగనంపూడి: స్పందన ఫిర్యాదులను పట్టించుకోకుండా ఉన్నతాధికారులను పక్కదారి పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత నెల 20వ తేదీన దొంగ ఆర్ నంబర్లపై జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. స్పందనలో ఫిర్యాదును పట్టించుకోని సంబంధిత అధికారులు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి తప్పుడు నివేదిక ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని స్పందన ఫిర్యాదుపై సరైన దర్యాప్తు చేయాలని ఆయన కోరారు.

అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి విరాళం



అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి గోవిందరెడ్డికి విరాళం అందజేస్తున్న పారిశ్రామికవేత్త పాండురంగప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ముగ్గురు అమ్మవార్ల ఆలయాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. శ్రీ కుంచాలమ్మ, శ్రీ దుర్గాలమ్మ, శ్రీ ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలకు పలువురు వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, గ్రామస్తులు భారీగా విరాళాలు అందజేస్తున్నారు. శనివారం అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డికి పారిశ్రామికవేత్త సజ్జా పాండురంగప్రసాద్, యోజన దీపిక దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. విరాళ దాతకు ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

పారిశుధ్య సిబ్బందికి పనిముట్ల పంపిణీ



పారిశుధ్య సిబ్బందికి పనిముట్లు అందజేస్తున్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి

పెదగంట్యాడ : ప్రతి నిత్యం రోడ్లు, కాలువలను పరిశుభ్రం చేసే సిబ్బందికి తగినన్ని పనిముట్లను అందజేయాల్సిన అవసరం ఉందని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. ఈ మేరకు వార్డు పరిధిలోని శానిటేషన్ కార్యాలయం వద్ద శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింగరావు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బందికి శనివారం పనిముట్లు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



అక్కిరెడ్డిపాలెం జెడ్పీ స్కూల్లో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పీవీ సహాయ చారిటబుల్ ట్రస్ట్, వెబార్డ్ ట్రస్ట్, మోసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించాయి. శనివారం జరిగిన కార్యక్రమంలో సహాయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తమ సంస్థ విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్ట్ సహకరిస్తుందన్నారు. 401 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 40 మందికి కళ్లజోళ్లు అవసరమయ్యాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, పి.వి.సహాయ చారిటబుల్ ట్రస్ట్ మెంబర్ కె.శ్రీనివాస్, సభ్యులు, విశాఖ ఐ హాస్పిటల్ క్యాంప్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, ఉపాధ్యాయులు దేముళ్లు, మహ్మద్ ఇస్మాయిల్, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం : అనారోగ్య సమస్యలు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం అగనంపూడి దరి చట్టివానిపాలెం ప్రాంతానికి చెందిన నడిమింటి గోవిందరావు (52) ప్రైవేట్‌గా విద్యుత్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలు ఉండడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఎప్పటిలాగే తన పనులు ముగించుకుని రాత్రికి ఇంటికి వచ్చి తీవ్ర అనారోగ్యంతో సతమతమయ్యాడు. అందరూ పడుకున్న తర్వాత తెల్లవారుజామున ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుడికి భార్య లక్ష్మి, కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు మోహన్‌నాయుడు ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అభినందనలు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీలకు ఎంపికైనందుకుగాను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు, వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విద్యార్థులను అభినందించారు. శనివారం ఉదయం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఈనెల 8వ తేదీన జరిగిన సెలక్షన్ ప్రక్రియలో పాఠశాలకు చెందిన 7,8,9 తరగతుల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి ఈనెల 30న చత్తీస్‌ఘడ్‌లో జరగబోయే జాతీయ స్థాయి సబ్ జూనియర్ త్రో పోటీలకు వెళ్తున్నారన్నారు. ఎంపికైన వారిలో 9వ తరగతికి చెందిన సీహెచ్ సునీత, ఎం.తేజశ్రీ, లవ్‌కుమార్, టి.జైశ్రీవర్ధన్, వి.మనోజ్‌కుమార్, డి.మహేష్, 8వ తరగతికి చెందిన ఎస్.సాయిలిఖిత, డి.చందన, ఒ.చరిష్మా, 7వ తరగతికి చెందిన ఎస్.రిషిత ఉన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సిటు గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో త్రిపుర సంఘీభావ నిధులు సేకరించారు. మార్చి 2న త్రిపురలో జరిగిన అసెంబ్లీ ఫలితాల వెల్లడి సమయంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు భౌతికదాడులకు పాల్పడ్డారని సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఆ దాడిలో గాయపడిన వారికి ఆర్థిక సాయం అందించడం ద్వారా వారికి మనోధైర్యం కల్పించాలని వారు శనివారం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఉదయం స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ ఆధ్వర్యంలో సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రానికి రూ.55,585 సమీకరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వైటీ దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి



కమిషనర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ఇమ్రాన్

గాజువాక : జీవీఎంసీ 66వ వార్డులోని వివిధ కాలనీల్లో రోడ్లు, డ్రైన్లకు సంబంధించి అభివృద్ధి పనులు మంజూరు చేయాలని ఆ వార్డు కార్పొరేటర్ మహ్మద్‌ఇమ్రాన్ కోరారు. ఈ మేరకు ఆయన జీవీఎంసీ కమిషనర్ రాజాబాబును శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ వార్డులోని ఇందిరా కాలనీ, బీసీ రోడ్డు, కైలాసనగర్ కాలనీల్లో ఈ పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

ఘనంగా ఏఎంసీ స్నాతకోత్సవం



ఏఎంసీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు తదితరులు



వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జస్టిస్ సోమయాజులు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవం, ఎంబీబీఎస్ 96వ స్నాతకోత్సవం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. 2017 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు స్వాగతం పలికారు. రిటైర్డు డీఎంఈ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శశిప్రభ, ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్ గౌరవ అతిథులుగా విచ్చేసి వైద్య వృత్తి ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 2017 ఎంబీబీఎస్ బ్యాచ్‌ను అభినందించారు. వైద్యులు మానవతా దృక్పథంతో రోగులకు సేవ చేయాలన్నారు. వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. డాక్టర్ జి. రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) కొత్తగా ఉత్తీర్ణులైన మెడికల్ గ్రాడ్యుయేట్లతో ప్రమాణం చేయించారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ఉత్తమ విద్యార్థులు డాక్టర్ శ్యామా మదిన్య, డాక్టర్ డి.వైష్ణవి ప్రియాంక అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ 2017 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్మిస్తున్న సెంటినరీ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.

2న పైడితల్లమ్మ పండగ



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ప్రశాంతినగర్ పైడితల్లమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవ తేదీలు ఖరారు చేయడానికి శనివారం కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 30న ఘటాల సంబరాలు, ఏప్రిల్ 1న తొలేళ్లు, 2న అమ్మవారి ప్రధాన పండగ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బుద్ద శివాజీ, గొర్లె కృష్ణమూర్తి, చందన గాంధీ, జి. పెదబాబు, నారిపిల్లి సత్తిరాజు, మళ్ల సతీష్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాన్స్‌పోర్టు లారీ
- యువకుడికి తీవ్ర గాయాలు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పల్టీ కొట్టిన లారీ

గాజువాక : ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ ఒకటి హెచ్‌టీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పినట్టు ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. గాజువాక హైస్కూల్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైస్కూల్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీని రోడ్డుపై పార్క్ చేసి ఉంచారు. ఆ తరువాత దాన్ని పక్కన పెట్టడం కోసం లారీ డ్రైవర్ దాన్ని రివర్స్ చేస్తున్నాడు. ఆ సమయంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న హెచ్‌టీ విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో అక్కడి స్తంభాలకున్న విద్యుత్ వైర్లు తెగి చెల్లా చెదురయ్యాయి. ఆ సమయంలో రోడ్డుపై జన సంచారం తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాగా ఈ ఘటనలో షిప్‌యార్డులో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న నర్సింహరాజు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తెగిపడిన ఒక విద్యుత్ వైరు నర్సింహరాజుకు తగలడంతో అతను తుల్లి పడిపోయాడు. ఈ ప్రమాదంలో బాధితుడికి తుంటి ఎముక దెబ్బ తిన్నట్టు వైద్యవర్గాలు తెలిపాయి. ఈ ఘటన జరగడానికి ఐదు నిమిషాల ముందే కొంతమంది విద్యార్థులు ఆటోలో వెళ్లారు. అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసెంబ్లీ తీర్మానాన్ని ఉపసంహరించాలి



ధర్నాలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బి. తౌడన్న మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకులు 40 లక్షల మంది ఉన్నారన్నారు. బీసీ కులాలైన వారిని ఎస్టీలో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మానం చేయడం అన్యాయమన్నారు. ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ తీర్మానం ఆమోదించకుండా చూడాలని రాష్ట్రపతికి, ఎస్సీ, ఎస్టీ కమీషన్‌కు మెమొరాండం ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన నాయకులు శోభన్‌కుమార్, ఎ. రవీంద్ర, ఎం. కృష్ణయ్య, కె. కృష్ణయ్య, జె. రామన్న, కె. చిన్నంనాయుడు, దాకే సువర్ణరత్నం, ఎం. రాజేశ్వరరావు, ఎ. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నడుపూరు విద్యార్థుల సత్తా



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే నాగిరెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్

పెదగంట్యాడ: జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్–2023 (ఎన్ఎంఎంఎస్) అర్హత పరీక్షలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 19 మంది విద్యార్థులు అర్హత సాధించి సంచలనం సృష్టించారు. అలాగే జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి అబ్బురపరిచారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల వరకూ కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించనుంది. గత ఏడాది ఇదే పాఠశాల నుంచి 15 మంది ఎంపిక కావడం విశేషం. ఎస్సీ, బీసీ–బి కేటగిరీల్లో ప్రథమ స్థానం, బీసీ–డి విభాగంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయిలో బి.హేమంత్‌కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. మొదటి పది ర్యాంకుల్లో ఐదు, 20 ర్యాంకుల్లో పది ర్యాంకులను సాధించారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ శనివారం అభినందించారు.

రాహుల్ గాంధీపై కక్ష సాధింపు తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెదగంట్యాడ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించడం సరి కాదన్నారు. ఈ మేరకు స్థానిక నడుపూరులోని రాజీవ్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తీరును ఎండగట్టారు. దీనిపై రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యరబాల భూలోక, చట్టి సింహాచలం, కట్టా అప్పారావు, గుడివాడ శ్రీను, నమ్మి అప్పలనాయుడు, హరిబాబు, వీరారావు, రాజు, ఆనంద్, ప్రసాద్, షరీఫ్ పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆస్కార్ రావడం గొప్ప విజయం

- ప్రముఖ సంగీత దర్శకుడు తమన్



పూజలు నిర్వహిస్తున్న సంగీత దర్శకుడు తమన్

సింహాచలం: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడంతో తెలుగు సినిమా స్థాయి ఉన్నత శిఖరాలకు వెళ్లిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్ అన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో పాటకు ఆస్కార్ రావడం తెలుగు సినీ పరిశ్రమ గర్వించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం రామ్ హీరోగా.. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నట్టు చెప్పారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, సంపంగి శ్రీనివాసరావు తమన్ వెంట ఉన్నారు.

ఒక్క కార్టూన్‌తో నవరసాలు పలికించవచ్చు



కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

అల్లిపురం: ఒక్క కార్టూన్‌తో నవరసాలు పలికించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. హాస్యం, వినోదం, రాజకీయం.. ఇలా ఏదైనా కార్టూన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. మేఘాలయా హోటల్లో శనివారం జరిగిన కార్టూన్స్ వాచ్ కార్టూన్స్ ఫెస్టివల్–2023ను ఆమె ప్రారంభించారు. కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్టూన్ వాచ్ ఫెస్టివల్‌ను విశాఖలో నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్టూన్ వాచ్ కుటుంబం ఎడిటర్ త్రయంబకశర్మను గౌరవించుకోవడం ముదావహం అన్నారు. చత్తీస్‌ఘడ్ టూరిజం ఎండీ అనిల్ సాహు, డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ కార్టూన్లు ఎన్నో భావాలను తెలియజేస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కార్టూనిస్టులను సత్కరించారు. కార్టూనిస్టులు ఎం.శంకర్‌రావు, టి.వెంకటరావు, శ్రీహరి వెంకటరమణ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.